# యాక్సిడెంట్

మంచు కురుస్తోంది... అయినా లోపలికి వెళ్లాలనిపించడంలేదు.

నా గుండెల్లో రగులుతున్న మంట చలిని కాచుకున్నట్టు వెచ్చగానే అనిపిస్తోంది.

జరిగిన సంఘటన తాలూకు షాక్ నుంచి నేను బైటపడలేదు. పడలేను కూడా. ఆ షాక్‌తో నా కాళ్లు చచ్చుబడినట్టు అయినాయి. సర్వశక్తులు నన్ను అసహ్యించుకుని వదిలేసి వెళ్లినట్టు నిస్సత్తువగా మారిపోయాను.

ఎలాగోలా మంచం మీంచి లేచి బాల్కనీలో నిలబడగలిగాను. కానీ, ఇక్కడి నుంచి మాత్రం అంగుళం కూడా కదల్లేను అనిపిస్తోంది. కదలలేకపోతున్నాను. ఎదురుగా ఉన్న పార్క్‌లో ఏపుగా ఎదిగిన చెట్లు నన్ను చూస్తూ వికటంగా నవ్వుతూ పరిహాసం చేస్తున్నట్టుగా అనిపిస్తోంది. గాలి, పగలబడి నవ్వుతూ నానుంచి దూరంగా వెళ్లిపోతున్నట్టుగా నిలువునా ముచ్చెమటలు పోశాయి. నా కళ్లముందు నా బెడ్‌రూమ్, బెడ్‌రూమ్ నుంచి ఓ పక్కగా డైనింగ్ హాల్, దాన్నానుకుని కిచెన్... నాకిప్పుడు ఎలాగో కనిపిస్తున్నాయి. ఆ పరిసరాలన్నీ చాలా అపరిచితంగా అనిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా నాది అనుకున్న ఆ సామ్రాజ్యం నాది కానట్టు అందులో నేనిప్పుడు ప్రవేశం కోల్పోయినట్టు అనిపిస్తోంది.

ఆ పవిత్రమైన ప్రదేశాల్లో నా పాదం మోపలేని మహాపాపం నేను చేశాను. చూపు తిప్పుకుని కిటికీ వైపు చూశాను. కిటికీలోంచి బెడ్‌మీద నలిగిన దుప్పటి నన్ను చూసి వికటాట్టహాసం చేస్తోంది? నో... కళ్లు మూసుకుని కిటికీ రెక్క దభాల్న వేసేశాను.

ఎంత దారుణం జరిగింది? అసలెలా జరిగింది? ఇలా జరగడానికి నేనెంతవరకు బాధ్యురాల్ని? ఈ పాపంలో నా పాత్ర ఎంత? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం ఎవరు చెప్తారు? చెప్పగలిగితే ఒక్కరే చెప్పగలరు. ఆ ఒక్కరు ఎవరో కాదు, నా భర్త. నిజమే ఆయనే చెప్పగలడు. ఎంతో మంచివాడు, సహృదయుడు, నిజాయితీపరుడైన నా భర్త.

అవును అతడే నా పట్ల న్యాయమూర్తిగా వ్యవహరించి నేను చేసిన అపరాధాన్ని క్షమించగలరో, శిక్షించగలరో నిర్ణయించేది, నిర్ణయించాల్సింది.

ఎంతటి ఘోరం నేను చేసింది? ఎంతటి మహాపరాధం!

సాధారణంగా ప్రతి మనిషి జీవితంలో కొన్ని సంఘటనలు ఎందుకు జరుగుతాయో తెలియకుండా జరిగిపోతుంటాయి. వాటి తాలూకు జ్ఞాపకాలు మాత్రం చిత్రవధ చేస్తాయి. జీవితాలను చిందరవందర చేస్తాయి. అందుకేనేమో ఓ అనుభవజ్ఞుడు జీవితాన్ని యాక్సిడెంట్‌తో పోల్చాడు. ప్రమాదంలో ఏర్పడే గాయాలే జీవితంలో జరిగే విషాదాలు. ఆ గాయాల మచ్చలు ఎన్నటికీ మాని పోకుండా నిరంతరం జరిగిన ప్రమాదాన్ని తల్చుకుంటూ, మరో ప్రమాదం జరక్కుండా మనల్ని మనం కాపాడుకోడానికి దోహదం చేసే గుర్తులు కాబోలు!

ఏది ఏమైనా ఈ రోజు నా జీవితంలో జరిగింది మాత్రం మేజర్ యాక్సిడెంట్.

జరిగిన యాక్సిడెంట్ నా హృదయానికి చాలా పెద్ద గాయమే చేసింది. ఆ గాయం తాలూకు మచ్చ నామీదే కాదు నా కుటుంబం మీద కూడా శాశ్వతంగా ఉండిపోతుంది.

ఎలా నేనేం చేయనిప్పుడు? ఈ పాపాన్ని ప్రక్షాళనం చేసుకునే మార్గం ఏమిటి? తల పగిలిపోయే ఆలోచనలు. పవిత్రమైన స్నేహాన్ని అశాశ్వతమైన, క్షణభంగురమైన శారీరక సుఖం కోసం అపవిత్రం చేసిన అతడిని నేను క్షమించ లేను. అలా అని అతనిపైన ఏం చర్య తీసుకోగలను? అతనికి ఏ శిక్ష విధించ గలను.

నిజం చెప్పాలంటే ఇవాళ జరిగిన సంఘటనలో నా తప్పు ఎంత మాత్రం లేదని నా అంతరాత్మ ఘోషిస్తోంది. ఈ మనిషిని నమ్మడమే నేను చేసిన తప్పు.

ఈ మాట నేనే కాదు విషయం తెలిశాక నా భర్త, నా పిల్లలు, ఈ సమాజమూ కూడా నన్నే నిందిస్తారు. ఎందుకంటే నేను స్త్రీని. స్త్రీకి తరతరాలుగా ఈ సమాజం ఎన్నో పరిమితులు విధించింది. నేను వాటిని అతిక్రమించాను. అందుకే భగవంతుడు నాకీ శిక్ష వేశాడు.

ఒక స్త్రీగా సమాజం గీసిన లక్ష్మణగీతని దాటకూడదు. కానీ, దాటాను. యాభైకి చేరువ అవుతూ కూడా అందం పట్ల, ఆకర్షణ పట్ల ఆసక్తి చూపించాను. పెద్దదానిలా, ఓ తల్లిలా, ఇల్లాలిలా హుందాగా ప్రవర్తించకుండా అతనిని

రెచ్చగొట్టేలా ప్రవర్తించి ఉంటాను. అందుకే అతను అవకాశం తీసుకున్నాడు. అవును అతను మగాడు. మగాడు, ఆడదానితో పవిత్రమైన స్నేహాన్ని ఎన్నడూ ఆకాంక్షించడన్న నగ్నసత్యం నాకిప్పుడే తెలిసింది. చాలా ఆలస్యంగా తెలిసింది.

అతనికి చనువు ఇవ్వడం నా తప్పు. అవును చనువిచ్చేముందు నేను నా వయసు గురించి, నా కుటుంబ నేపథ్యం గురించి ఆలోచించాను. కానీ, అతని వయసు గురించి నేను ఆలోచించలేదు. బహుశా అదే నేను చేసిన తప్పు కావచ్చు.

అదేంటో ఇంతకాలం నేను చాలా పెద్దదాన్ని అయిపోయాను అను కున్నాను. నిజం చెప్పాలంటే ఆయన నన్ను ప్రేమగాగానీ, మోహంతోకానీ తాకి ఎంతకాలమైంది! వ్యాపారం పనుల్లో తలమునకలుగా ఉంటూ బాగా పొద్దుపోయాక అలసిపోయి ఇంటికి వచ్చే ఆయనకి విశ్రాంతి కలగచేయడమే నా లక్ష్యంగా భావించాను. రకరకాల సమస్యలతో చికాగ్గా వచ్చే ఆయనని, నా చేతివేళ్లతో సున్నితంగా స్పృశించి, వేళ్లసందుల్లోంచి అనురాగ ధారలు కురిపిస్తూ సాంత్వన కలిగించడమే భార్యగా నా ధర్మం అనుకున్నాను. ఆయన నన్ను శారీరక సుఖం కోసం వేధించనే వేధించరు. బహుశా ఆయనకి సంపాదన ధ్యాస తప్ప, సుఖాల పట్ల వ్యామోహం లేకపోవడంచేతేమో. నాకు ఆ ధ్యాసే రాలేదు. పిల్లల పెళ్లిళ్లు అయి వాళ్లు రెక్కలు విదిల్చి ఎగిరిపోతుంటే విస్మయంతో చూస్తూ ఉండిపోయాను. వంటరిదాన్ని అయానని విషాదంలో మునిగిపోయాను.

కాని... కానీ ఇదేంటి ఇలా జరిగిందేంటి? నేను మర్చిపోయాననుకున్న అనుభూతులను అతను తట్టిలేపుతోంటే నా వయసు నాకెందుకు గుర్తురాలేదు. ఆ స్పర్శతో కొత్త లోకాలకి ద్వారాలు తెరిచినట్లు ఎందుకైంది? నేనింత బలహీను రాలినా? ఎలా? ఎలా జరిగింది? ఇంతకాలం కాపాడుకున్న నానైతిక విలువలని ఆ ఒక్క క్షణం నేనెందుకు దిగజార్చాను?

ఎందుకు? ఎందుకలా జరిగింది?

సాధారణంగా ప్రయాణంలో అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు జరుగుతా యంటారు.

కానీ, నా జీవనయానంలో ఎంతో అప్రమత్తంగా ఉన్నాను. ప్రతి క్షణం నన్ను నేను కాపాడుకుంటూ, దాదాపు 35 సంవత్సరాలుగా ఎంతో జాగ్రత్తగా ఉన్నాను. ఇలాంటి ప్రమాదాలు ఎన్నెన్నో జరిగే పరిస్థితుల నుంచి చాకచక్యంగా బైటపడుతూ ఇవాళ జీవితపు చివరి దశకు వచ్చాను. అనుకుని తృప్తిగా అనుకునే లోగా నా ఆత్మవిశ్వాసం మీదా, నా సిద్ధాంతాల పట్లా, నా వ్యక్తిత్వం మీదా

దారుణమైన దెబ్బ తగిలింది.

నేనింక నా వాళ్లకెవరికీ మొహం చూపించలేను. ఇంతకాలం నా సిద్ధాంతాలకి, నాలోని విలక్షణమైన వ్యక్తిత్వానికి గర్వపడుతూ బతికిన నేనివాళ ఓ అపరాధిలా నా వాళ్లందరి ముందూ తలవంచుకుని నిలబడే స్థితికి వచ్చాను. జరిగిన సంఘటన వలన ఎంతో అన్యోన్యంగా, అపురూపంగా సాగిపోతోన్న నా దాంపత్య జీవితంలో తుఫాను రేగుతుంది. నా సంసార నావను తల్లకిందులు చేసి, ముంచేస్తుంది. ఆయన ఎంత మంచివారు? వీధిలోకి వెళ్లినా, ఇంట్లోకి మరొక స్త్రీ వచ్చినా తలెత్తి కూడా చూడని గుణాభిరాముడు. అలాంటి రాముడికి నేను భార్యగా ఇంక ఎలా బతకగలను? సీతమ్మలాంటి పవిత్రురాలు పుట్టిన ఈ గడ్డమీద నాలాంటి చపలచిత్తురాలు... ఛీ, ఛీ నాకింక చావే శరణ్యం. కానీ, కానీ నాకు చావాలనిపించడంలేదు. ఆయన నన్ను క్షమించి చేరదీస్తే ఆయన భార్యగా, ముత్తైదువుగా హాయిగా పిల్లల సమక్షంలో దర్జాగా చనిపోవాలని ఉంది. అయినా నేనిలా ఎలా అయ్యాను?

ఓణీలు వేసుకుంటున్న రోజుల నుంచీ నా అందానికి ముగ్ధులై, పిచ్చివాళ్లై నా వెంట తిరిగిన ఎందరినో తప్పించుకుని నన్ను నేను రక్షించుకుంటూ, ఓ సంస్కారవంతుడికి ఇల్లాలినై, అతని ప్రేమానురాగాల జలధిలో తలమునకలుగా మునిగిపోయి, ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చాను. అనుకూల దాంపత్యం, ముత్యాల్లాంటి పిల్లలు, ఇద్దరు పిల్లలు ఇంజనీర్లయ్యారు. మగపిల్లలు కావడంతో ఎక్కువ బాధ్యత కూడా నామీద పడలేదు. పెద్దవాడు తనంతట తానుగా అమెరికా వెళ్లిపోయాడు, భార్యని తీసుకుని. అమ్మానాన్నల్ని కనిపెట్టుకుని ఇక్కడే ఉంటానన్న రెండోవాడిని వాడి భార్య బలవంతంగా లండన్ తీసికెళ్లిపోయింది.

పిల్లలిద్దరూ లేకపోవడంతో జీవితం శూన్యంగా మారినట్టనిపించింది.

ఇంతకాలం ఆయన వ్యాపార పనులతో ఎంత బిజీగా ఉన్నా, ఎంత ఆలస్యంగా ఇంటికి వచ్చినా ఏమీ మాట్లాడని నేను ఆయన్ని వేధించడం ప్రారంభించాను. ఆయన ఎంత ఓదార్చినా వంటరితనం నన్ను భయపెడుతోంటే, ఆయన్ని మూడురోజుల పాటు కదలకుండా ఖైదీని చేశాను ఇంట్లో. “ఇలా ఇంట్లో ఎంత కాలం ఉంటాను. బిజినెస్ దెబ్బతింటుంది. నీకేదైనా వ్యాపకం కల్పిస్తాను. దిగులు పడకు” అంటూ వ్యాపారం అనే వ్యాపకంలో పడేశారు ఆయన. అది ఆయన చేసిన నేరం. ఆ నేరానికి శిక్షగా నేనీ వయసులో నైతికంగా దిగజారిపోయాను. పతనమైపోయాను.

ఇంట్లోనే ఉంటూ చేసే వ్యాపారం ఆమ్‌వే ప్రొడక్ట్స్‌కి ఏజన్సీ నా వ్యాపారం.

మధ్యమధ్య మీటింగ్స్ అటెండ్ అవుతున్న తరుణంలో పరిచయం అయ్యాడతను. నాకన్నా నాలుగేళ్లు చిన్నవాడు. మొదటిసారిగా వంటరిగా బైటకు వచ్చానేమో, తెలియని విషయాలు చాలా ఉన్నాయి. తెలుసుకోవాల్సిన ఆవశ్యకతా ఉంది. తెలియచేసేవాళ్ళు కావాలి. అందుకే అతనితో పరిచయం స్నేహంగా మారడానికి ఎన్నో రోజులు పట్టలేదు. చిన్న సందేహం తీర్చుకోవడం కోసం ప్రారంభమైన మా పరిచయం ఇరవైనాలుగ్గంటల్లోనే స్నేహంగా మారింది. ఆ స్నేహంలో కబుర్లు, హాస్యాలు, చర్చలు, ఆ తరువాత హఠాత్తుగా అతని మాటల్లో నా అందం పట్ల ప్రశంసలు, నావైపు చూసే అతని కళ్ళల్లో నా పట్ల ఆరాధన, అయినా, యాభై ఏళ్లకు చేరువైన నేను అతనితో పెరిగిన, పెరుగుతున్న సాన్నిహిత్యాన్ని చూసి కలవరపడలేదు. కానీ, హఠాత్తుగా అతను నా అందాన్ని పొగిడినప్పుడు ముందు నిర్ఘాంతపోయాను. తరవాత మురిసిపోయాను.

మీ అందం నన్ను పిచ్చివాడ్ని చేస్తోంది. ఈ వయసులో ఇంత అందంగా ఎలా ఉన్నారు? మీకు ఎదిగిన కొడుకులున్నారంటే నమ్మలేకపోతున్నాను.

పాతికేళ్ల అమ్మాయితో మరో పాతికేళ్ల కుర్రాడు అనే మాట.

నాలో ఆ క్షణం కలిగిన భావానికి నిర్వచనం అందలేదు. సమాధానంగా చిరునవ్వు నవ్వడం తప్పే అయింది. మీ నవ్వు ఎంత బాగుందో తెలుసా? ఎప్పుడన్నా మీవారు చెప్పారా? చెప్పారా? ఏమో నాకేం గుర్తులేదు. ఎప్పుడో పెళ్లి అయిన కొత్తలో బహుశా శోభనం రోజు అన్నారేమో ఆ తరవాత జీవితం యాంత్రికం అయింది. కాకపోతే పెళ్లికి ముందు చాలామంది అన్నారు.

కానీ ఇతను అంటోంటే నాకేదోలా అనిపించింది. ఎక్కడో మారుమూల అంతరాంతరాల్లో చిన్న ప్రకంపన.

ఈ వయసులో కూడా నేను మగాళ్లని ఆకర్షించగల అందగత్తెనా?

నా అందాన్ని చాలామంది పొగిడారు. అప్పుడెప్పుడూ కలగని స్పందన ఇతను పొగుడుతుంటే అదోలా ఉంది. ఎంత ఒద్దనుకున్నా, అతని మాటలు పదేపదే వినాలన్న కోరిక, సహజ సౌందర్యానికి కొంత మెరుగు పెట్టుకోవాలన్న తపన అనుకోకుండానే నాలో ఏదో మార్పు. ముందు మానసికంగా, ఆ తరవాత అతనితో పరిచయం ఒద్దంటున్నా పెరుగుతోంది. ఆయన పదకొండు దాటితేగానీ ఇల్లు చేరరు. ఆయన పనులలాంటివి. నేనేం చేయగలను? అందుకే వంటరితనాన్ని అధిగమించడానికి అతని కంపెనీ బాగానే ఉందనిపించింది.

మీటింగ్ నుంచి నన్ను అతను తన కారులో డ్రాప్ చేయడం, మధ్యమధ్య హోటల్స్ లో కాఫీ, టిఫినూ అంటూ తిప్పడం, చిన్నచిన్న బహుమతులు ఇవ్వడం.

ఓరోజు పిల్లల విషయంలో బాధపడుతోంటే హఠాత్తుగా దగ్గరకి తీసుకున్నాడు నన్ను. తమాషా అనుభూతి ఎంతోకాలంగా మర్చిపోయాననుకున్న మధురానుభూతి. నా భర్త నుంచి కూడా పొందలేకపోయిన పారవశ్యం. ఆరోజే నాకెందుకో భయం వేసింది. నేను పతనం వైపు ప్రయాణిస్తున్న భావన. నా పాతివ్రత్యం మంటగలసిపోతోందన్న ఆవేదన. మానసిక సంఘర్షణ. ఆరోజే ఆయనతో అన్నాను. ఈ వ్యాపారం మానేస్తానండి, అనవసరంగా కొత్త పరిచయాలు, కొత్త మొహమాటాలు.

"నీ తలకాయ, ఎప్పుడు చూసినా కూపస్థ మండూకంలా ఉంటానంటావేం? ఏమైందిప్పుడు? నీకేం కష్టం" నాకేం కష్టమో నోరు తెరిచి చెప్పలేకపోయాను. ఇంక ఇప్పుడెలా చెప్పగలను? జరిగింది కష్టంకాదు, నష్టం అని ఎలా చెప్పగలను.

నా మీద వ్యామోహమో, అతనిలోని కామమో నాకు తెలియదు. ఆ ఒక్క బలహీన క్షణాన్ని క్యాష్ చేసుకున్నాడు. నేను నిశ్చేష్టురాల్నైపోయాను.

అంతా అయాక "సారీ మీ అందం నన్ను వివశుడ్ని చేసింది" అంటూ వెళ్లిపోయాడు.

సారీ! ఎంత ఈజీగా చెప్పి వెళ్ళిపోయాడు. కానీ నాశనం కాబోతున్న నా బతుకు ఈ రెండక్షరాలతో నిలబడగలదా?

కాసేపట్లో ఆయన వస్తారు. చెదిరిన నా జుట్టు, నా బొట్టు చూస్తారు. నా వాలకం చూడగానే ఏం జరిగిందో అర్థం చేసుకుంటారు. ఆ తరవాత నా బతుకేంటి? నా పిల్లలకి నేనేం సమాధానం చెప్పాలి?

అలా అని ఏమీ జరగనట్లు ఎప్పటిలా ఆయన్ని స్వాగతించనా? పిల్లలతో ఎప్పటిలా ఉండగలనా? నా అంతరాత్మకి నేనేం సమాధానం చెప్పాలి? చెప్పి నా జీవితం నేనే చేతులారా నాశనం చేసుకోనా? అలా జరక్కూడదు.

నేను ఏం జరగనట్టు చిరునవ్వుతో ఆయనకి స్వాగతం పలకాలి. ఈ తప్పే ఆయన వల్ల జరిగితే ఆయన మనసులో ఇంత ఘర్షణ జరిగేదా? అయితే ఆయన ఇంతవరకు శ్రీరామచంద్రుడిలానే ఉన్నారా? ఏమో! నాకు తెలియదేమో! ఏదన్నా జరిగే ఉంటుందా? ఛీ, ఛీ ఏంటి? ఆయన్ని అనుమానిస్తున్నాను సిగ్గులేకుండా. కామెర్ల రోగిలా. ఛ, ఎంత దిగజారిపోతున్నాను!

నేను ఇంకా, ఇంకా దిగజారకుండా ఉండాలంటే నాకు ఆయన అండ కావాలి. ఈ ఇల్లు కావాలి. నా పిల్లల ప్రేమ కావాలి. అవును నేను నా ఈ సంసారం అనే కంచుకోటను వదులుకోకూడదు. అందుకే ఏం జరగనట్టు ఉండాలి. ఈ కంచుకోట దాటానంటే నా బతుకు బజార్న పడుతుంది. బంధువుల్లో సుగుణ వతిగా, శీలవతిగా పేరు పొందిన నేను ఇప్పుడు పతితగా భర్తచేత త్యజించబడి వీధుల పాలవనా? పిల్లల్ని చూడకుండా, ఆయన లేకుండా బతకగలనా? ఏం చేయను? ఏం చేయను? ఘర్షణ, సంఘర్షణ.

అవును తప్పదు, నా సంసారం నాశనం కాకుండా వుండాలంటే ఆయన్నీ వంచించాలి. నన్ను నేను వంచించుకోవాలి. తప్పదు. ఈ యాభైఏళ్ల వయసులో తను కాలు జారిందంటే పిల్లలు క్షమిస్తారా? క్షమించరు. అందుకే ఏం జరగనట్టే ఉండాలి.

అలా అని చెప్పకుండా ఎలా? ఇన్నేళ్లుగా మామధ్య దాపరికాలే లేవు. ఎంతో నిజాయితీతో కూడిన సంసార జీవితం నాది. నేనిప్పుడు తప్పు చేశాను. చేసిన పాపం చెబితే పోతుందట. ఆయనకి చెప్పి ఆయన ఓదార్పులో నన్ను నేను ప్రక్షాళనం చేసుకోవాలి. ఆయన తప్పకుండా క్షమిస్తారు. నా సహచరుడు ఇంత కాలం తనకి సేవలు చేస్తూ, సుఖాన్ని ఇస్తూ, తన తల్లితండ్రులని కంటికి రెప్పలా కాపాడుతూ, తన పిల్లల్ని కనిపెంచి వృద్ధిలోకి తీసుకొచ్చి తన వంశాన్ని నిలిపి నందుకు నేను చేసిన ఈ తప్పును ఒక యాక్సిడెంట్‌గా భావించి క్షమిస్తారు. అవును క్షమిస్తారు. ఆయన క్షమించాకే లోపలికి వెడతాను. అప్పుడే మరోసారి ఈ ఇంట్లోకి ఆయనతో కలిసి కుడికాలు పెడతాను. తప్పదు. లేదంటే ఓ న్యాయ మూర్తిగా ఆయన నా భవిష్యత్తుకి ఇచ్చే తీర్పుని శిరసావహిస్తాను. ఆయన విధించే శిక్ష ఏదైనా సరే భరిస్తాను.

అదిరే గుండెలతో, అంధకారం అలుముకున్న నా భవిష్యత్తులో చిరు వెలుగుకోసం వెతుక్కుంటూ ఆయన కోసం ఎదురుచూస్తూ ఆ చీకట్లో ఆ మంచులో అలాగే నిలబడిపోయాను.

ఆ క్షణం రానేవచ్చింది. ఆయన వచ్చారు. కారు చప్పుడైంది.

నా కాళ్లు శిలలై స్థంభించిపోయాయి. గుండెల్లో ఫిరంగులు మోగుతున్నాయి. కళ్లల్లోంచి వేడి రక్తం బొట్లు, బొట్లుగా ధరణి గుండెల్లోకి జారి ఆ గుండెల్ని చీలుస్తున్నట్టుగా అనిపిస్తోంది. గాలి, గాలి హాహాకారాలు చేస్తున్న ధ్వని. ఆయన బూట్ల శబ్దం ఆ నిశ్శబ్దంలో భయంకరంగా వినిపించసాగింది.

శిలకి చైతన్యం వచ్చినట్టు కొద్దిగా కదిలి, బలవంతంగా అడుగులు వేస్తూ వీధివైపు బాల్కనీలోకి నడవసాగాను.

ఆయన కారు పార్క్‌చేసి, తాళం చేతులు విలాసంగా తిప్పుతూ, మరోచేత్తో సెల్ పట్టుకుని హుందాగా నడిచివస్తున్నారు. ఆ నడకలో రాజసం. హఠాత్తుగా సెల్ ఫోన్ మోగింది.

నేను ఊపిరి బిగపట్టి, నన్ను నేను కూడదీసుకుంటూ, ఆయనతో మాట్లాడడానికి అక్షరాలు వెతుక్కుంటుంటే, దగ్గరగా, మరీ దగ్గరగా ఆయన గంభీరమైన స్వరం సరదాగా వినిపిస్తోంది. "ఏయ్ ఏంటి ఇప్పుడు ఫోన్ చేశావు. నీ దగ్గర్నించి బయలుదేరి అరగంట కాలేదు. అప్పుడే విరహమా? రేపు వస్తాగా... ష్యూర్... నీ దగ్గరకు రాకుండా నేను బతకగలనా? ఓకే డార్లింగ్ బై. గుడ్‌నైట్..."

ఢమాల్, ఢమాల్, ఢమాల్ విస్ఫోటనాలు... నెత్తిన, సరిగా నా నడి నెత్తిన విరిగిపడుతున్న కొండచరియలు. కళ్లముందు పరచుకున్న చీకటి తెరలు, తెరలుగా విడిపోతూ... మంచుముద్దల్లా నామీదే పడుతున్న భావన. ఆయన అడుగుల శబ్దం దగ్గరైంది. హఠాత్తుగా నా శరీరం చలితో వణకడం ప్రారంభించింది.

నిశ్శబ్దంగా, నిర్జీవంగా లోపలికి నడిచాను.

***

*(జూన్ 2007, భూమిక)*